సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 16 । ఆగస్టు । 2025





## తంబళ్లపల్లెలో టీడీపీ వర్గ పోరు

తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీలో మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి మధ్య వర్గపోరు శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమంది. -8లో



## రిగ్గింగ్ చేసుకుని సంబరాలా?

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో రిగ్గింగ్‌తో గెలుపొంది టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నేత నిసార్‌అహ్మద్ అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.410 | రూ.520 |
| రెండోరకం | రూ.270 | రూ.400 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 121 మెట్రిక్ టన్నులు



# సంక్షేమం ధ్యేయం.. అభివృద్ధి లక్ష్యం



జెండా వందనం చేస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్, ఎస్పీలు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



పోలీసు పరేడ్ మైదానంలో భరతనాట్యం చేస్తున్న విద్యార్థినులు

- మహిళల ఆర్థిక ప్రగతికి పెద్దపీట
- అన్నదాత సుఖీభవ ద్వారా రైతులను ఆదుకున్నాం
- తల్లికి వందనంతో విద్యార్థుల చదువుకు భరోసా
- అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి అనుమతులు
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**సాక్షి రాయచోటి:** అన్నమయ్య జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్నామని.. ఒకపక్క ప్రగతి, మరోపక్క సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు వెళుతున్నామని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలోని పోలీసు పరేడ్ మైదానంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యా సాగర్‌నాయుడు, జేసీ ఆదర్శరాజేంద్రన్ సమక్షంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందని తెలిపారు. వారి ఆశయాలు, లక్ష్యాలను స్వీకరించి దేశభక్తి స్ఫూర్తితో అదేబాటలో పయనించి ప్రజాసేవకు, రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తున్నామన్నారు.

### ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం

తమ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నందుకు తాను ఎంతో గర్విస్తున్నానని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఎలాంటి లోటుపాట్లు, విమర్శలకు అవకాశం లేకుండా పకడ్బందీగా అమలు చేసేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించామన్నారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించామన్నారు.

### పేదరిక నిర్మూలనకు చర్యలు

అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 1,88,408 మంది రైతుల ఖాతాల్లో రూ.127.88 కోట్లు జమ చేశామన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 62,182 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారని, ఇందులో 59,182 బంగారు కుటుంబాలను 6857 మంది మార్గదర్శకులు దత్తత తీసుకునే కార్యక్రమం పూర్తి చేశామని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం కింద జిల్లాలో 2,33,000 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.283 కోట్లు జమ చేశామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో 2,18,025 మందికి ప్రతి నెల రూ. 94,34,00,000 అందజేస్తున్నామని పేర్కొన్నారు. మహిళల జీవనోపాధి కోసం ఉన్నతి పథకం కింద 675 మంది ఎస్సీ, ఎస్టీలందరికీ రూ. 3.35 కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు.

### రాయచోటి పట్టణ అభివృద్ధి

జిల్లా కేంద్రంగా ఏర్పడిన రాయచోటి పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రాయచోటిలో చేపట్టిన క్రికెట్ స్టేడియం, శిల్పారామం, నగర వనం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు. జిల్లాలో అభివృద్ధి పనులు, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలియజేశారు.

### వాట్సాప్ గవర్నెన్స్ సేవలు విస్తృతం

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను 700కు పెంచామని మంత్రి తెలిపారు. గతంలో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సుమారు 300కు పైగా పౌర సేవలను అందుబాటులో తీసుకు వచ్చామని తెలిపారు. అన్నా క్యాంటీన్ల ద్వారా రూ. 5లకే రుచికరమైన ఆహార పదార్థాన్ని అందిస్తున్నామన్నారు. పీఎం సూర్యఘర్ ద్వారా సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పథకంలో బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20 వేల రాయితీ ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత సోలార్ విద్యుత్ అందిస్తుందన్నారు. జిల్లాలో రూ.6210 కోట్లతో చేపట్టిన 276 కిలోమీటర్ల పొడవైన ఎనిమిది జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో రూ.16 కోట్లు ఖర్చు చేసి రహదారుల మరమ్మతు పనులు పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది మరో రూ.6 కోట్లతో 2600 కిలోమీటర్ల రహదారుల మరమ్మతులు చేపట్టామన్నారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. హార్సిలీహిల్స్‌ను చిత్ర నిర్మాణాలకు అనువైన ప్రదేశంగా గుర్తించి ఉత్తమ సినిమా చిత్రీకరణ అవార్డును అందుకోవడం గర్వకారణమన్నారు. హార్సిలీహిల్స్‌లో ఈనెలలోనే రెవెన్యూ గెస్ట్‌హౌస్ నిర్మించి ప్రారంభించామన్నారు. ప్రముఖ ఒబెరాయ్ సంస్థ ద్వారా సెవెన్‌స్టార్ హోటల్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.



### సాగునీటి పనులు

జిల్లాలో సాగు, తాగునీటికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు. కృష్ణానదితోపాటు ఇతర ప్రాజెక్టులు నీటితో నిండుగా ఉన్న నేపథ్యంలో రాయలసీమకు నీళ్లు తీసుకువస్తామని తెలిపారు. జిల్లాలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు కింద 56 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఆరు బ్రాంచ్ కాలువలు, రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల కింద 1,55,350 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు రూ. 480 కోట్లతో లైనింగ్ పనులు చేపడుతున్నామని, వెలి గల్లు రిజర్వాయర్ కింద 24 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని అడవిపల్లి జలాశయ కాలువ ఆధునీకరణ పనులను రూ.420 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. చిన్నమండెం లిఫ్ట్ స్కీమ్ ద్వారా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ నుంచి 43 చెరువులకు నీరు ఇచ్చేందుకు రూ.15 కోట్లతో పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు పునః నిర్మాణానికి రూ.787 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతులు మంజూరు అయ్యాయన్నారు. అలాగే జల జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ కింద నీటి సరఫరా కోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.127 కోట్లతో చేపట్టిన 3709 పనులకు గాను 3370 పనులు పూర్తయినట్లు వెల్లడించారు. పద వ తరగతి పరీక్షా ఫలితాల్లో 19,784 మంది విద్యా ర్థులు 91 శాతంతో ఉత్తీర్ణత సాధించారన్నారు.

### మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు

ఇచ్చిన మెగా డీఎస్సీ మాట ప్రకారం నిర్వహించి త్వరలో ఉద్యోగాలు భర్తీ చేయనున్నామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా ఆస్పత్రుల్లో అత్యుత్తమ వైద్యాన్ని అందిస్తున్నామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఇప్పటి వరకు 87 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 45,875 మందికి చికిత్సలు అందించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం కింద 2.52 లక్షల కుటుంబాలకు ఉపాధి, శ్రామికులకు జాబ్‌కార్డులు పంపిణీ చేశామన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 49 లక్షల పనిదినాలకు గాను 44 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన 71,583 గృహాలకు గాను 40,188 గృహాలను పూర్తి చేశామన్నారు. జిల్లాలోని 501 హౌసింగ్ కాలనీల్లో రూ.26 కోట్లతో నీటి వసతి, విద్యుత్ సరఫరా కల్పిస్తున్నామని వివరించారు. 2025–26 సంవత్సరంలో రూ.31 కోట్ల పెట్టుబడులతో స్థాపించిన 2315 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా 5387 మందికి ఉపాధి కల్పించామన్నారు. మహిళా శిశు సంక్షేమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో బాలసంజీవిని, సంపూర్ణ పోషణ కింద 9 వేల మంది గర్భిణులు, 7108 మంది బాలింతలు, 91,537 మంది చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. దీపం–2 పథకం కింద 2,96,682 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసినట్లు వివరించారు. నైపుణాభివృద్ధి ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

- ఈ కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, ఆర్డీఓ శ్రీనివాసులుతోపాటు జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్య్రయోధుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న మంత్రి, జిల్లా కలెక్టర్



అగ్నిమాపకశాఖ సిబ్బంది ప్రదర్శన



పోలీసుల మార్చ్‌ఫాస్ట్

### ఖరీఫ్‌లో 5655 హెక్టార్లలో పంటల సాగు

జిల్లాలో 2025 సీజన్‌కు సంబంధించి 53,007 హెక్టార్లలో సాధారణ పంటల సాగు కావాల్సి ఉండగా, వర్షాభావ పరిస్థితుల కారణంగా 5655 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 35,245 క్వింటాళ్ల విత్తనాలు రూ.13.22 కోట్ల సబ్సిడీతో 55,835 మంది రైతులకు పంపిణీ చేసి నూరు శాతం ప్రగతి సాధించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం 44,687 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. 33 డ్రోన్లతో 80 శాతం సబ్సిడీతో రైతు గ్రూపులకు అందించామన్నారు. 2025 సీజన్‌కు సంబంధించి 12,273 కోట్ల ఆర్థిక లక్ష్యానికి గాను ఇప్పటి వరకు రూ.3768 కోట్ల పంట రుణాలను బ్యాంకు ద్వారా అందించామని వివరించారు. ఉద్యానశాఖ ద్వారా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఈ ఏడాది రూ.19.12 కోట్లతో పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. చిట్వేలి, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, పెనగలూరు, నందలూరు మండలాల్లో మామిడికి ప్రత్యామ్నాయంగా 200 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లాలో 14 వేల ఎకరాల్లో మల్బరీ పంటను 9000 మంది రైతులు సాగు చేస్తున్నట్లు వివరించారు. సూక్ష్మ నీటి సాగు పథకం కింద బిందు, తుంపెర సేద్యాన్ని ప్రోత్సహిస్తూ జిల్లాలో 11,752 మంది రైతులు 12,162 హెక్టార్లలో పరికరాలను వినియోగిస్తున్నారన్నారు. ఈ ఏడాది 14 వేల హెక్టార్లలో అమలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు.



జయహో భారత్.

### పాల ఉత్పత్తి పెంపు

పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి పరిశ్రమ ద్వారా పాల ఉత్పత్తి గణనీయంగా పెంచుతున్నామని, 9 లక్షల లీటర్ల మేర పాల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. మినీ గోకులం పథకం కింద పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు 90 శాతం రాయితీతో 1182 మంది లబ్ధిదారులకు షెడ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. పశుగ్రాస అభివృద్ధికి 75 శాతం రాయితీతో పశుగ్రాస ఉత్పత్తి విత్తనాలు అందించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ విభాగం పరిధిలో పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.94 కోట్లతో 1215 సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు.



మైన్ ప్రూఫ్ వాహనంపై జెండా రెపరెపలు



సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు



కలికిరి సైనిక్ స్కూలు విద్యార్థుల ప్రదర్శన



వేడుకలు తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

## గోవిందమాంబకు సారె సమర్పణ



సారె తీసుకుని వస్తున్న గాలి కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, రమాదేవి

**బ్రహ్మంగారిమఠం:** బ్రహ్మంగారిమఠంలో శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని గోవిందమాంబకు శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం చీర, సారె, పసుపు, కుంకుమలను సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ బ్రహ్మణి సేవాసమితి కడప నిర్వాహకురాలు అంకిరెడ్డిపల్లె రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కర్ణాటక మాజీ మంత్రి గాలి కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి, నొస్సం వీరభద్రస్వామి పాల్గొన్నారు. మహిళా భక్తులు మఠం పురవీధులలో చేపట్టిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, ఈవీ రమణారెడ్డి, శేగినేని పోతులూరయ్య పాల్గొన్నారు.

## ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**రాయచోటి జగదాంబసెంటర్:** సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి) హామీ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి బస్టాండు ప్రాంగణంలో మంత్రి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్‌తో కలిసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా స్త్రీ శక్తి పథకం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి చూపించి కండక్టర్ జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించవచ్చన్నారు. ఆర్టీసీలోని మొత్తం 8,458 బస్సుల్లో మహిళలు, యువతులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ఉచిత ప్రయాణ స్త్రీ శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేసిందన్నారు. ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. మహిళా ప్రయాణికుల పట్ల సంస్థ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా ఉండాలన్నారు. సిబ్బందితో ఆర్టీసీ అధికారులు సమావేశం నిర్వహించి జాగ్రత్తగా విధులు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్, డిపో మేనేజర్ రాము తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**కురబలకోట:** మండలంలోని గడ్డిత్తుపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవరింటి శివ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పెద్ద దిక్కు మృతి చెందడంతో.. ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. శివకు చిన్నపిల్లలు ఉన్నారు. వీరి చదువుల కోసం ఆదుకుంటానని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం రూ.2 లక్షలు అందించారు. ఈ ఆర్థిక సాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్ ఉమాపతిరెడ్డి, కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, సోమిరెడ్డి, ఎంపీటీసీ ఆనందరెడ్డి, ప్రకాష్ రెడ్డి, రాజశేఖర్, అశోక్, సుధీర్‌రెడ్డి తదితరుల ద్వారా అందజేశారు. శివ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు.



రూ. 2 లక్షలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## వేడుకున్నా ఓటు వేయనివ్వలేదు.. ఇదో ఎన్నికా?

- జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి నాయకుల దుశ్చర్యలపై మండిపాటు
- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

**రాజంపేట రూరల్:** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో కూటమి ప్రభుత్వం నాయకులు ఎన్నికల నియమావళిని అభాసుపాలు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ చరిత్రలో ఇటువంటి ఎన్నిక ఎక్కడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఎన్నికల సంఘం, పోలీసు శాఖ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో విఫలమయ్యాయన్నారు. అభ్యర్థి కూడా ఓటు వేసుకోకపోవడం ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదన్నారు. ఏజెంట్‌లను బూత్‌లలోకి రానివ్వకుండా జరిగిన ఏకైక ఎన్నికలు ఇవేనన్నారు. ఇతర నియోజకవర్గం నుంచి మనుషులు వచ్చి బూత్‌లు ఉన్న గ్రామాలలో షామియానాలు వేసుకొని జాతరను తలపించేలా చేస్తూ.. ఓటర్లను ఓటు వేసేందుకు పోనివ్వకుండా అడ్డుపడ్డారంటే వారికి పోలీసులు ఎంత సహకరించారో ఇట్టే అర్థం అవుతుందన్నారు. 'మా ఓటు మమ్మల్ని వేసుకోనివ్వండి' అని మహిళా ఓటర్లు ప్రాధేయపడ్డా, కాళ్లు పట్టుకుంటామని వేడుకున్నా.. వారిని ఓటు వేసుకోనివ్వలేదంటే ఈ కూటమి ప్రభుత్వంలో స్వాతంత్య్రం ఉన్నాట్టా.. లేనట్టా అని నిలదీశారు. డీఐజీ తన స్థాయి మరచి హెడ్ కానిస్టేబుల్ లాగా ప్రవర్తించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంతకంటే దుర్మార్గమైన చర్య ఉందా అని నిలదీశారు. బీహార్ వంటి రాష్ట్రాలలో ఉన్న సంస్కృతిని మన రాష్ట్రంలో కొనసాగించటం దుర్మార్గపుచర్య అని మండిపడ్డారు. ఈ ఎన్నికపై అన్ని ఆధారాలతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే, వారికి చీమ కుట్టినట్టు కూడా అనిపించకపోవటం ప్రజాస్వామ్యమేనా అని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

## క్లుప్తంగా

### మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుందాం

– కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి

**రాయచోటి :** దేశ స్వాతంత్య్రం కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడలలో నడవాలని కలెక్టర్ ఉపదేశించారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు కలెక్టర్ మిఠాయిలు పంచి పెట్టారు.

### మహాత్మాగాంధీకి నివాళులు

**రాయచోటి :** స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు.

### హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈకి ప్రశంసాపత్రం



పురస్కారాన్ని అందుకుంటున్న హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ దీనదయాళ్‌రాజు

**మదనపల్లె రూరల్ :** స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ దీనదయాళ్‌రాజు ఉత్తమ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం రాయచోటిలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో హౌసింగ్ పీడీ రమేష్‌రెడ్డి సమక్షంలో డీఈ దీనదయాళ్‌రాజు పురస్కారాన్ని అందుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**జమ్మలమడుగు :** ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి గ్రామం నుంచి బుల్లెట్‌పై ప్రొద్దుటూరుకు వెళ్తుతున్న ఫయాజ్(25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం పని నిమిత్తం ఫయాజ్ ప్రొద్దుటూరుకు వెళుతుండగా మణిపూర్‌కు చెందిన గీతా సర్కస్‌కు చెందిన ముగ్గురు స్నేహితులు స్కూటర్‌లో ఎదురుగా వస్తుండటంతో అదుపు చేయలేక బుల్లెట్ టీవీఎస్ ఢీకొన్నాయి.

# ఉత్తమ ప్రతిభా అధికారులకు ప్రశంసా పత్రాలు

**రాయచోటి :** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ ప్రతిభను కనపరిచిన జిల్లా అధికారులు, సిబ్బందికి మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు.

**స్వాతంత్య్ర సమరయోధులకు ఘన సత్కారం**

79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం ఉదయం రాయచోటి పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లతో కలిసి స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం చేశారు. రైల్వేకోడూరుకు చెందిన కీ.శేలు రామలింగరాజు కుమారుడు రాధాకృష్ణ రాజు, టి సుండుపల్లికి చెందిన దివంగత ఎర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి కుమారుడు ఎర్రపు రెడ్డి, శివకుమార్ రెడ్డిలు సన్మానం పొందిన వారిలో ఉన్నారు.



రాధాకృష్ణరాజును సన్మానిస్తున్న మంత్రి, జిల్లా కలెక్టర్ తదితరులు

**16వ సారి వ్యాఖ్యతగా పోలీస్ వెంకట యాదవ్**

దేశ స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవ వేడుకలలో 16వ సారి వ్యాఖ్యతగా పోలీస్ వెంకట యాదవ్ అరుదైన రికార్డును సాధించారు. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలలో వ్యాఖ్యతగా వ్యవహరించారు. ఆయన వాగ్ధాటితో సమర యోధుల జాతీయతను, పోరాటాన్ని, దేశం గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని, శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాలను తన మాటలతో, స్వరంతో జిల్లా అధికారులను, విద్యార్థులను, వీక్షకులను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం యాదవ్ జిల్లా ఎస్పీ పీఆర్‌ఓగా పనిచేస్తున్నారు.

**పోలీసుల సేవలు ప్రశంసనీయం**

దేశ రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభిప్రాయపడ్డారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రిజర్వ్ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జిల్లా ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశం సాధించిన ప్రగతిలో పోలీసుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి జాతీయ జెండాను ఎగురవేశారు.



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్



డీఆర్వో మధుసూదన్‌రావు | వెంకటాద్రి, ఏఎస్పీ



కృష్ణమోహన్, రాయచోటి డీఎస్పీ | మహేంద్ర, మదనపల్లె డీఎస్పీ | శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ | సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి



ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారి | లక్ష్మీప్రసన్న, పీడీ, ఏపీఎంఐపీ | త్యాగరాజు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ | లక్ష్మీపతి, జిల్లా అధికారి, జీఎస్‌డబ్ల్యుఎస్



సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ | కృష్ణ కిశోర్, వికలాంగులశాఖ ఏడీ | సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖాధికారి | నాగభూషణం, జిల్లా పర్యాటక అధికారి



గౌస్‌బాష, డీఎస్‌డీఓ | అమర్‌నాథరెడ్డి, డీఎల్‌డీఓ, మదనపల్లె | శ్రావణి, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | బీమేశ్వరరావు, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | రామాంజనేయులు, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | అన్సారి, డీటీ, కలెక్టరేట్ | సుబ్రమణ్యం, డీటీ, కలెక్టరేట్ | ఖలందర్, డీటీ, కలెక్టరేట్ | పురుషోత్తంరాజు, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | మైసూరారెడ్డి, జాయింట్ కలెక్టర్ సీసీ



రాజా రమేష్, సీఐ | రాజారెడ్డి, సీఐ | తులసీరాం, సీఐ | శంకర మల్లయ్య, సీఐ | మోహన్‌కుమార్, సీఐ | చంద్రశేఖర్, సీఐ | ఆదినారాయణరెడ్డి, సీఐ | మహమ్మద్ అలీ, సీఐ | మధు, సీఐ | రాఘవరెడ్డి, సీఐ



రమణ, సీఐ | రాజా, సీఐ | చలపతి, సీఐ | యుగంధర్, సీఐ | అబ్దుల్ జహీర్, ఎస్ఐ | విజయ్‌కుమార్‌రాజు, హెడ్ కానిస్టేబుల్ | శివరామ్ నాయుడు, హెడ్ కానిస్టేబుల్ | జయప్రసాద్, కానిస్టేబుల్ | స్వామినాయక్, కానిస్టేబుల్ | అబ్బాస్ అలీఖాన్, మున్సిపల్ మెప్మా అధికారి, రాయచోటి

# ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



స్త్రీ శక్తి కార్యక్రమం



పీ4 శకటం

**రాయచోటి :** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ఫ్లాటూన్లు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వ శాఖలు తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను శకటాల ద్వారా ప్రదర్శించి సంబంధిత వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఉత్తమ ప్రదర్శనలతో పౌరసరఫరాల శాఖ, రాయచోటి మున్సిపాలిటీ శకటాలకు మొదటి బహుమతి, రాష్ట్ర రోడ్డు రవాణా శకటానికి ద్వితీయ బహుమతి, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష శకటానికి తృతీయ బహుమతి, నీటి యాజమాన్యం సంస్థ ప్రత్యేక బహుమతిని గెలుచుకున్నాయి. అలాగే వాట్సాప్ గవర్నెన్స్, జిల్లా సర్వే, భూమి రికార్డుల శాఖ అన్నమయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమ శాఖ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ, గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య శాఖ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయక సంస్థలు ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 'ఇదే మన భారతం' అనే గీతానికి సంబేపల్లె కేజీబీవీ స్కూల్‌కు చెందిన 45 మంది విద్యార్థినులు నృత్యప్రదర్శన చేశారు. నమో నమో భారతం అనే గీతానికి రాజంపేట బీసీ వెల్ఫేర్ హాస్టల్‌కు చెదిన 28 మంది విద్యార్థినులు నృత్యం ప్రదర్శించారు. కలికిరి సైనిక్ స్కూల్ 37 మంది విద్యార్థిని, విద్యార్థులు దేశభక్తి థీమ్ ఆధారిత పాటకు నృత్య ప్రదర్శన చేపట్టారు. రామసముద్రం మండలం మట్లవారిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 34 మంది విద్యార్థులు కోలాటం ప్రదర్శించారు. రాయచోటి ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ 40 మందితో దేశభక్తి గీతం గ్రూప్ డాన్స్ ప్రదర్శించారు.

# తంబళ్లపల్లెలో భగ్గుమన్న టీడీపీ వర్గపోరు

- వెంబడించి శంకర్ వర్గీయులపై తీవ్ర దాడి
- జయచంద్రారెడ్డి, మరో ఇద్దరు నేతల ప్రోద్భలంతోనే దాడి చేశారన్న బాధితులు



గాయపడిన నటరాజ నాయక్, సాగర్ కుమార్

**మదనపల్లె :** తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీలో ఉప్పు-నిప్పుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి మధ్య వర్గపోరు శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమంది. శంకర్ వర్గీయులను మదనపల్లెలో మాస్కులు ధరించిన ఎనిమిది మంది వెంబడించి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. శంకర్ గురువారం వ్యక్తిగత పర్యటన నిమిత్తం పెద్దమండ్యం మండలం వచ్చి వెళ్లిన మరుసటిరోజే ఆయన వర్గీయులపై దాడి జరగడం టీడీపీలో కలకలం రేపుతోంది. బాధితుల కథనం మేరకు వివరాలు.. ములకలచెరువు మండలానికి చెందిన కే.సాగర్ కుమార్ (35) నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడిగా, పెద్దమండ్యం మండలం అవికేనాయక్‌తండా సర్పంచు, రాజంపేట పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు బి.నటరాజ నాయక్(32) శంకర్ వర్గీయులుగా పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన జయచంద్రారెడ్డి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతుండగా..శంకర్, జయచంద్రారెడ్డి వర్గాలు పరస్పరం వ్యతిరేకించుకొంటూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం, ఆరోపణలు చేయడం జరుగుతూ వస్తోంది ఏడాదిగా సోషల్‌మీడియాలో వార్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో బెంగళూరులో ఉంటున్న సాగర్‌కుమార్ గురువారం శంకర్ పర్యటన కోసం వచ్చారు. శుక్రవారం తిరిగి బెంగళూరు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. మదనపల్లె సొసైటీ కాలనీలోని శంకర్ కార్యాలయం నుంచి ఇద్దరు బైక్‌పై నక్కలదిన్నెకు వెళ్లి బైక్‌లో పెట్రోలు పోయించుకుని, భోజనం చేసేందుకు పట్టణంలోకి వస్తుండగా ఒక స్కార్పియో, బైక్‌లపై వచ్చిన ఎనిమిది మంది తిట్టడంతో దాడి జరిగే ప్రమాదాన్ని పసిగట్టి పట్టణం వైపుకు వెళ్లకుండా బైక్‌ను తిప్పిలి హంద్రీనీవా కాలువ వైపు లోపలికి వెళ్లారు. అక్కడికి చేరుకున్న వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న శంకర్ వర్గీయులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. తర్వాత బాధితులు మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు.

**ఆ ముగ్గురే దాడి చేయించారు:**

తమపై టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, సీడ్ మల్లికార్జున నాయుడు, గౌడసానిపల్లె శంకర్‌లే దాడి చేయించారని బాధితులు సాగర్‌కుమార్, నటరాజనాయక్ ఆరోపించారు. అధికారంలో ఉండి తమపైనే టీడీపీ నేతలు దాడి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులే తమను కాపాడారని అన్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన రెడ్డిరామ్

**మదనపల్లె రూరల్ :** బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన ఘటన శుక్రవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. విఠలం గ్రామానికి చెందిన రమణ కుమారుడు రెడ్డి రామ్(27) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో విఠలం నుంచి చింతపర్తికి వెళుతుండగా శ్రీవారి పాదాలగుడి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు బాధితుడిని వాల్మీకిపురం సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించి, చికిత్సల అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు చికిత్సలు అందించినా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు.

## ఇద్దరు కేబుల్ దొంగలు అరెస్ట్



కేబుల్ దొంగల్ని అరెస్ట్ చేసిన పోలీసులు

**గుర్రంకొండ :** ఇద్దరు కేబుల్ దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన మండలంలోని తరిగొండ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం మండలంలో కేబుల్ దొంగల సంచారం తెలిసి వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి, గుర్రంకొండ ఎస్ఐ రఘురామ్ తరిగొండ ప్రభుత్వాస్పత్రి వద్ద నాకాబందీ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో అనుమానాస్పదంగా రావడంతో పాటు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకొన్నారు. వారు కలకడ మండలం గుడిబండ పంచాయతీ కోటగుడిబండ గ్రామానికి చెందిన సదుం మధు(24), గుడిసిపాటి గణేష్‌కుమార్(28)గా గుర్తించారు. వారి వద్ద నుంచి 200 మీటర్ల ఫినోలెక్స్ కంపెనీకి చెందిన కేబుల్‌తో పాటు ఒక పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం వాల్మీకీపురం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ రఘురామ్ తెలిపారు.



# రిగ్గింగ్ చేసుకుని సంబరాలా...?

- జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అడ్డదారిలో టీడీపీ విజయం
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్



**మదనపల్లె రూరల్ :** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తో గెలుపొంది ఏదో సాధించేశామంటూ టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓడిపోతే ప్రజలు తన పాలనపై రెఫరెండంగా భావిస్తారేమోనని భయపడి, ఎలాగైనా గెలవాలనే తపనతో పోలీసులు, వ్యవస్థను అడ్డంగా పెట్టుకుని దొడ్డిదారిలో విజయం సాధించిందన్నారు. పులివెందులలో వేలాదిమంది టీడీపీ కార్యకర్తలను పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించి, ఓటర్లను ఓటు వేయనివ్వకుండా బెదిరించి, వెనక్కి పంపారన్నారు. ఏజెంట్లను రానివ్వకుండా, ఏజెంట్ ఫారాలను చించి, వారిపై దౌర్జన్యం చేయడాన్ని పోలింగ్, ఎన్నికలు అంటామా అనేది కూటమినాయకులే ఆలోచించుకోవాలన్నారు. ఖాకీ చొక్కాలను, లాఠీలను, కొంత మంది అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఏకపక్షంగా ఎన్నికలను నిర్వహించారన్నారు. ఎన్నికలను నిజాయితీగా, ధర్మబద్ధంగా, పారదర్శకంగా, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిపి ఉంటే.. రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఎన్నికల విధులు నిర్వహించిన జిల్లా కలెక్టర్..సీసీ ఫుటేజ్ లేదా వెబ్‌కాస్టింగ్ ఇచ్చేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కూటమిప్రభుత్వ పాలనపై ప్రజల రెఫరెండం కావాలని కోరుకుంటే, ప్రజాస్వామ్యబద్ధంగా తిరిగి ఎన్నికలు నిర్వహించాలన్నారు.

# బీటెక్ చదివినా ఉద్యోగం రాలేదు.. ఉపాధి దొరకలేదు

ఫ్యాన్‌కు ఉరివేసుకుని తనువు చాలించిన నిరుద్యోగి

**రాయచోటి :** బీటెక్ చదువుకున్నా ఉద్యోగం రాలేదు.. ఉపాధి దొరకలేదన్న వేదనతో నిరుద్యోగ యువకుడు ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకొని తనువు చాలించాడు. రాయచోటి పట్టణ పరిధిలోని మునెప్పగారిపల్లెకు చెందిన తోట చైతన్యకుమార్(34) శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘాతుకానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు కన్నీటి రోదనలతో విలపించారు. బీటెక్ వరకు చదువుకొని ఉద్యోగం లేక ఇంటి వద్దనే ఉంటున్నట్లు తండ్రి సిద్దిరాములు తెలిపారు. ఏడాదిగా ఉద్యోగం కోసం ఎంత ప్రయత్నించినా రాలేదన్నారు. కొద్ది రోజులుగా ఉపాధి కోసం ప్రయత్నాలు చేసినా అవకాశాలు లభించడం లేదని మదనపడుతున్నట్లు తోటిమిత్రులు, బంధువులు తెలిపారు. ఉదయం 7 గంటల వరకు బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు తలుపులు తెరిచి చూడగానే ఫ్యాన్‌కు ప్రాణాలు పోయి వేలాడుతున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# లోలెవల్ కాజ్‌వేపై పోలీసుల గస్తీ



సిద్దవటం లోలెవల్ కాజ్‌వేపై పోలీసులు

**సిద్దవటం :** సిద్దవటం పెన్నానదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వేపై పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో శుక్రవారం పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారని ఒంటిమిట్ట సీఐ బాబు ఆదేశాల మేరకు, సిద్దవటం ఎస్ఐ సూచనల మేరకు కాజ్‌వేపైన బందోబస్తును ఏర్పాటు చేశారు. కాజ్‌వే ప్రమాదాలు జరకుండా మందస్తు చర్యగా అక్కడికి వచ్చే పర్యాటకులను రానివ్వలేదు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి చేపలు పట్టే వారు వస్తే వారిని కూడా అక్కడినుంచి పంపిచేశారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చి నదిలోకి దిగుతారనే ఉద్దేశ్యంతో కాజ్‌వే పైన్ ఉన్నామని పోలీసులు తెలిపారు.